క్లుప్తంగా

శివాలయంలో ఆరుద్ర పూజలు



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పాతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో రుద్రాభిషేకం, భస్మాభిషేకం, అన్నాభిషేకం జరిగాయి. అనంతరం భక్తులకు అన్న ప్రసాదవితరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పూర్తూ కార్యక్రమాల్లో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిరంగా యాత్ర



సంగారెడ్డిలో తిరంగా యాత్ర ర్యాలీ

కొండాపూర్(సంగారెడ్డి): బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు ఆధ్వర్యంలో ఆజాది కా అమృతోత్సవ్‌లో భాగంగా తిరంగా యాత్ర బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా కందిలోని పాండురంగ స్వామి ఆలయం నుంచి సంగారెడ్డి పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. యాత్రలో సంగారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, యువ మోర్చా రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కాంగ్రెస్‌తో సాధ్యం

ఝరాసంగం(జహీరాబాద్): దేశంలో మహిళా సాధికారత, నాయకత్వాన్ని ప్రోత్సహించడానికి తెలంగాణ యువజన కాంగ్రెస్ విభాగం శక్తి సూపర్ షీ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి సూపర్ షీ లో రెండు విభాగాలు ఉంటాయని, ఇందిరా ఫెలోషిప్‌తో పాటు శక్తి క్లబ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా సమాజంలోని మహిళలు ఎదగాలని దీని ఉద్దేశం అన్నారు. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని రాజకీయాల్లో చేరాలనేది ఇందిరా ఫెలోషిప్ యొక్క ఆకాంక్ష అని వెల్లడించారు. ఫెలోషిప్ కొరకు దరఖాస్తు చేసుకునే వారికి ఒక పరీక్షతోపాటు ఓరియంటల్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. సోమవారం నుంచి ఇందిరా ఫెలోషిప్ ప్రారంభించబడుతుందన్నారు. 15న మహిళలతో జెండావందనం చేసి ప్రారంభించనున్నట్లు వివరించారు.


నియామకం



దేవయ్యను సన్మానిస్తున్న సభ్యులు

పటాన్‌చెరు టౌన్: యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడిగా దేవయ్య యాదవ్ నియామకమయ్యారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నిక నిర్వహించినట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ.. యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్, మాజీ అధ్యక్షుడు వెంకటేష్, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో ఆదివారం ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఫాం 6, 8 ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై కాలనీ వాసులకు వివరించారు.

ప్రశాంతంగా పరీక్ష

సంగారెడ్డి టౌన్: టైప్ రైటింగ్ పరీక్షలు ఆదివారం సంగారెడ్డిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. హయ్యర్, లోయర్ పరీక్షలకు వంద మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పరిశీలకుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

గొల్ల, కురుమల సంక్షేమానికి పెద్దపీట

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



లబ్ధిదారులకు గొర్రెలను అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత గొల్ల కురుమలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతులబోడుగా గ్రామానికి చెందిన లబ్ధిదారులకు 9 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తులకు జీవనోపాధి కల్పించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదగాలనే గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి 75 శాతం సబ్సిడీతో అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వరం చైర్మన్ వీరారెడ్డి, మండల పశు వైద్యాధికారి పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి అండగా ఉంటా



పరామర్శిస్తున్న దామోదర రాజనర్సింహ

మునిపల్లి(అందోల్): ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా అంటూ.. బాధితులకు మాజీ ఉపముఖ్య మంత్రి దామోదర రాజనర్సింహ భరోసా కల్పించారు. ఆదివారం మండలంలోని పొల్కంపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ అభిమాని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పొల్కంపల్లి సర్పంచ్ నాగమణి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, రాయికోడ్ మాజీ జెడ్పీటీసీ అంజయ్య, మునిపల్లి మాజీ ఎంపీటీసీ మంతూర్ సుధాకర్‌రెడ్డి, గోపులారం ఎంపీటీసీ పాండు, నాయకులు ఖమ్మంపల్లి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరడమ్మకు బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లో గ్రామ దేవత ఊరడమ్మకు వైభవంగా బోనాలను సమర్పించారు. వివిధ వాడల గుండా భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలనెత్తి గ్రామ పురవీధుల గుండా శోభాయాత్రగా గ్రామ ప్రధాన కూడలిలోని ఆలయానికి చేరుకున్నారు. శోభాయాత్రలో కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

హాజరైన మాజీ డిప్యూటీ సీఎం

ఊరడమ్మ బోనాల వేడుకలకు మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ కేధారినాథ్ పాటిల్ ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కేధారినాథ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్, మండల, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, జి.అంజయ్య, నర్సింలు, ప్రభాకర్, సర్పంచ్ కేధారినాథ్ పాటిల్, పీఏసీఎస్ చైర్మన్ నాగిశెట్టి తదితరులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరిలోనూ దేశభక్తి ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్: ప్రతీ ఒక్కరిలోనూ దేశభక్తి ఉండాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. 'నామట్టి.. నాదేశం' నినాదంతో ఆదివారం నారాయణఖేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీమాత ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన రహదారుల గుండా కొనసాగింది. పట్టణంలోని పలు కూడళ్లలో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, సీనియర్ నాయకులు మారుతిరెడ్డి, నగిరేశం, సుధాకర్, పట్నం మాణిక్, దిగంబర్‌పటేల్, శంకర్ పటేల్, జైపాల్, శివ, గోపాల్‌రెడ్డి, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి స్ఫూర్తితో శ్రమదానం



చెత్తను సేకరిస్తున్న ఢిల్లీ వసంత్ బృందం సభ్యులు

జహీరాబాద్ టౌన్: మంత్రి హరీశ్‌రావు స్ఫూర్తితో బీఆర్‌ఎస్ నాయకులు ఢిల్లీ వసంత్ నాలుగు వారాల నుంచి శ్రమదానం పనులు నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని చెన్నారెడ్డి నగర్ ప్రాంతంలో శ్రమదానం పనులు చేపట్టారు. మురికి కాలువల్లో పేరుకున్న చెత్తను తొలగించి ప్లాస్టిక్ కవర్స్, వాటిల్ బాటిళ్లు, గ్లాసులు, క్యారీ బ్యాగ్స్ తదితర చెత్తను సంచిలో వేసి తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ వంట సామగ్రి వితరణ

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు సంబంధించి మంగల్‌పేట్‌లోని హనుమాన్ ఆలయానికి వార్డు కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్ రూ. 50 వేల విలువ గల వంట సామగ్రిని వితరణ చేశారు. ఆదివారం తన జన్మదినాన్ని పురస్కరించుకొని దీనిని అందించినట్లు తెలిపారు. ఆయనను వార్డు పెద్దలు సన్మానించారు.

◆ మహిళ అదృశ్యం

జహీరాబాద్: పట్టణంలోని గుల్షన్‌నగర్ కాలనీకి చెందిన ఫర్హానా బేగం(35) తన ఐదేళ్ల కుమారుడితో అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 8వ తేదీన ఉదయం 5గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోగా.. కుటుంబ సభ్యులు వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ గృహలక్ష్మి దరఖాస్తు నిరంతర ప్రక్రియ

మునిపల్లి(అందోల్): గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ హరినంధన్ రావు ఆదివారం తెలిపారు. ఈనెల 9, 10వ తేదీలో సుమారు 1389 మంది ఆయా గ్రామాలకు చెందిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

◆ గడప గడపకూ ప్రచారం

మునిపల్లి(అందోల్): మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కుతురు త్రిష ఆదివారం మండలంలోని పెద్దచల్మెడ గ్రామంలో గడప గడప ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

◆ అధిక మాస పూజలు



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో గల శ్రీసిద్ధివినాయక ఆలయంలో అధిక మాస ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా రెండో రోజు ఆదివారం ఉదయం స్వామి వారికి మహారుద్రయాగం, సహస్ర అంతర్వ శిగ్ర పారాయణం నిర్వహించారు. సోమవారంతో ఈ పూజలు ముగియనున్నాయని అర్చకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందువల్ల విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ కోరారు. ఆదివారం సంగారెడ్డి ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందువల్ల ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్, ఎస్‌ఆర్‌బీఎస్‌ను ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే 30 వేల మందితో ప్రగతిభవన్ వద్ద ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, రీజినల్ కార్యదర్శి మొగులయ్య, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చండీయాగం



డీఎస్పీ, సీఐని సన్మానిస్తున్న నిర్వాహకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సత్యసాయికాలనీలో మహతీ జ్యోతిష్యాలయంలో అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ వేద పండితులు మలమంచి గురుజ్యోషి ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న సహస్ర నామ పారాయణపూర్వక రుద్ర చండీయాగం ఆదివారం కొనసాగింది. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన సంపంగి బ్రదర్స్ యజమాని రమేష్ పాల్గొనగా.. వారిని నిర్వాహకులు సన్మానించారు.

ఘనంగా నగర సంకీర్తన



భజన చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ప్రారంభించిన నగర సంకీర్తనకు ఆదరణ లభిస్తుంది. ప్రతీ ఆదివారం భక్తులు నగర వీధుల్లో భజనలు, కీర్తనలు పాడుకుంటూ చేస్తున్న పాదయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. ఈ వారం రామమందిర ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు జాతీయ జెండాలు చేతపట్టుకుని పాల్గొన్నారు.

మొక్కల ప్రాముఖ్యతను వివరించాలి



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్) : మొక్కల పెంపకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని హద్నూర్ నవ భారత్ పాఠశాల హెచ్‌ఎం రవి విద్యార్థులకు సూచించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద ఆదివారం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. లైట్లు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు ఆయన స్పందించి తన నిధుల నుంచి రూ.2లక్షలు మంజూరు చేయించారు.



లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

పథకాలకు ఆకర్శితులై చేరికలు

ఎమ్మెల్యే మాణిక్‌రావు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

జహీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో బూచనెల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు మహేష్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, ప్రజలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మాణిక్‌రావు పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, బస్వరాజ్, గోవింద్‌రెడ్డి, అమిత్‌కుమార్, దశరథ్, నర్సింహులు, మల్లికార్జున్, శివకుమార్, ఆంజనేయులు, వెంకట్, మహేష్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం ముత్తంగి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం పనులను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనం పూర్తయితే రైతులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, పాక్స్ చైర్మన్ బిక్షపతి, నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ నర్సింలు, తదితరులు

హత్నూర(సంగారెడ్డి): ఎమ్మెల్యే మదన్ రెడ్డి కృషితో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ అధ్యక్షులు వావిలాల నర్సింలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ హత్నూర గ్రామానికి రోడ్డు డివైడర్ నిర్మాణానికి రూ.8 కోట్లు ఎమ్మెల్యే మంజూరు చేయించారన్నారు. అలాగే గ్రామ అభివృద్ధికి రూ.50 లక్షలు, ముస్లిం మైనార్టీల కబరస్తాన్ ప్రహరీకి అదనంగా రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మారుమూల గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరాస్వామి గౌడ్, పంచాయతీ కార్యదర్శి మహేష్, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని మంగాపూర్ గ్రామానికి చెందిన నాయకుడు మన్నె సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆమెతోపాటు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యువత అధ్యక్షుడు కిషోర్, నాయకులు రామచంద్రారెడ్డి, రమేష్, శ్రీకాంత్, ఆశయ్య, ఇబ్రహీం, వీరేందర్ తదితరులున్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఆత్మీయ సమ్మేళనంలో ఎస్‌ఎంఆర్ యువసేన నాయకులు



మాట్లాడుతున్న ఎస్‌ఎంఆర్ యువసేన నాయకుడు

జిన్నారం(పటాన్‌చెరు): బీసీలకు ఎమ్మెల్యే టికెట్‌లను కేటాయించేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలని, చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు యువ సేన నాయకులు ఉండాలని ఎస్‌ఎంఆర్ యువజన నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన ఎస్‌ఎంఆర్ యువసేన ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ.. బీసీలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని, కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తున్న మధుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎంఆర్ యువజన నాయకులు మహేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపరిచిత ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశం

న్యాల్‌కల్(జహీరాబాద్): అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం అన్నారు. శనివారం రాత్రి న్యాల్‌కల్‌లోని బస్టాండ్ ఆవరణలో సైబర్ నేరాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెంట్ లేకుండా వాహనాలు నడపడం తదితర అంశాలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పాలని ఎవరైనా కాల్ చేస్తే స్పందించవద్దు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



న్యాల్‌కల్(జహీరాబాద్):మండల పరిధిలోని రేజింతల్ గ్రామానికి చెందిన జగనాథ్ ఇంటి ఆవరణలో శనివారం రాత్రి బ్రహ్మ కమలం వికసించింది. రాత్రి 10 గంటల ప్రాంతంలో పువ్వు వికసించడంతో ఇరుగు పొరుగు వారు తరలి వచ్చి ఆసక్తిగా తిలకించి పూజలు చేశారు.